# జాషువా బాపూజీ ఖండకావ్యంలో – గాంధీజీ వ్యక్తిత్వం

**బానోత్ వెంకటేశ్వర్లు**

తెలుగు పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యలయం, వరంగల్

Email: banothvenkat422@gmail.com

**Received: Sep. 2019 Accepted: Oct. 2019 Published: Nov. 2019**

ఆధునిక పద్యకవుల్లో పద్యానికి మానవతను, సంస్కరణను, కరుణ, చరిత్ర, సంస్కృతి, భక్తిని నిండుగా నేర్పించిన ప్రజాకవి. కులంపేరుతో తిరస్కరింపబడి తర్వాత తన కవితాశక్తితో ఏ కవి అందుకోలేని సత్కారాలు పొందారు జాషువ. గండపెండేరం, కనకాభిషేకం, గజారోహణం వంటి అఖండ గౌరవాలను అందుకున్నారు. జాషువా "ననువరించిన శారద లేచిపోవునే" అని ధీమా వ్యక్తం ప్రకటించాడు.జాషువా "క్రీస్తు చరిత్ర" రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నది. జాషువ ఖండ కావ్య ప్రక్రియను తన రచనతో మరింత విస్తృతపరిచాడు. అవన్ని తెలుగు సాహిత్యాన్ని మరింత పరిపుష్టి పరచడానికి దోహదం కల్పించాయి.

జాషువాకి నచ్చిన దేశభక్తుల్లో జాతిపిత గాంధీజి ఒకరు. బాపూజీ దివ్యమైన వ్యక్తిత్వం కలవారు. జాతీయపోరాటంలో ఆయన ప్రయోగించిన అహింస, సత్యాగ్రహం వంటి ఆయుధాల ప్రయోగం, ఒక్క నెత్తుటి చుక్క కూడా నేలమీద చిందకుండా సమరం సాగించడం జాషువాను విశేషంగా ఆకర్షించాయి. గాంధీజీ మరణాన్ని, మహాత్ముని మహాకావ్యాల్ని గుర్తుచేస్తూ ఆమృతికి గుర్తుగా ఈ ఖండ కావ్యాన్ని రచించడం జరిగింది. నాటి సాంఘీక వాతావరణాన్ని సమతూకంలో కథాంశంతో గాంధీజిని స్తుతిస్తూ రచన చేయడం బాపూజి కావ్య విశేషం.

గాంధీజీ పూర్తి పేరు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ. బాపూజీకి మరోపేరు భారతస్వరాజ్యం. భారతస్వతంత్ర్యానికి మారురూపం బాపూజీత్యాగం. స్వతంత్ర్యం వచ్చిన ఐదు నెలల పదిహేను రోజులకే గాంధీజిని "గాడ్సే" చంపేశాడు. గాంధీజీ మరణంతో భారతమాత శోకతప్తమయింది. ఆ ఆవేదనతో జాషువా కలంలో "బాపూజీ"గా పేరుపొందింది. ఈ కావ్యం 1948సంవత్సరంలో రాయబడింది. శ్రీ తిక్కవరపు రామిరెడ్డికి అంకితమిచ్చారు.

గాంధీ అంటే అక్టోబర్ 2కు, జనవరి 30కు పరిమితం చేసిన మన భారతీయుల కంటే, పాశ్చాత్యులే గాంధీజిని గురించి బాగా అవగాహన చేసుకున్నారు. ఒక మార్టిన్ లూథర్‌కింగ్, ఒక నెల్సన్ మండేలా గాంధీజికి నిజమైన అనుయాయులు. గాంధీజిని తెలుగు కవులు చాలామంది అర్థం చేసుకున్నారు. ఆనాటి సాంస్కృతిక బృందాలన్నీ తమతమ కళారూపాలలో గాంధీజిని – గాంధీజీ ఉద్యమాన్ని, గాంధీ తత్వాన్ని ప్రత్యేక్షంగానో – పరోక్షంగానో గాంధీని చిత్రించిన కావ్యాలు చాలా ఉన్నాయి. వాటిలో తెలుగు బాషమాధుర్యాన్ని రసపుగూళ్ళవంటి పలుకుబడులతో చవిచూపిన జాషువా గారి కావ్యం బాపూజీ.

సీ॥ విమత భూపతుల దోపిడి గుందు జాతిలో
దీపంబు బెట్టిన దినకరుండు
మానవత్వమును భూమండలంబున నెల్ల
చాటిన యాచార్య చక్రవర్తి
సత్యాగ్రహంబున శస్త్రచాలన విద్య
భూవికి దెచ్చిన మహాపురుష మౌళి
నిమ్న జాతుల కంటి నీరంబు దుడిచి యా
శ్వాసించు నిజుపేద బాంధవుండు

పండ్లు నూరుచున్న బహుమతంబులలోన
సహనవిద్య నేర్పు సాధకూడు,
భార్య బిడ్డలున్న ప్రత్యేక్ష దైవంబు
కామిత ప్రదాత, గాంధీతాత. (బాపూజీ, పు 13)

ఈ మేలైన మంచి గుణాలన్నీ కూడా బాపూజీ సాదనకు విలువలు తెచ్చాయి. వీటిని రూపొందించటమే కాక వాటిని ఆచరించి భారతప్రజల అభిమానాలను సంపాదించుకోవడం జరిగింది. గాంధీజి వాణికి సమ్మోహన శక్తి కలదు. ఆయన వినిపిస్తే కుమారి అగ్రం నుంచి మంచు శృంగం దాకా భారత ప్రజావళి ఆచరించడంలో వెనుకడుగు వేయదు. చెప్పింది చేస్తూనే ఉంటుంది.

అచ్చపు గ్రైస్తవుండనుచు నంజలిబట్టిరి క్రైస్తవోత్తముల్
పోచ్చెములేని భౌద్ధుడని పూజలోనర్చిరి బౌద్ధబిక్షకుల్
మచ్చరకించి మా ముసలమానని పల్కెదురుష్కలోకముల్
అచ్చమహాత్ముడన్న నుడికర్హుడు గాంధీఫకీరు డెంతయున్ (బాపూజీ పు. 20)

గాంధీజీ జాతీయోద్యమాన్ని కేవలం యుద్ధంగా బావించలేదు. సామాజిక చైతన్యాన్ని ఆకాంక్షించి సర్వమతాలను ఆదరించారు. కులాల మధ్య ఉన్న అంతరాలను తొలగించడానికి యత్నించాడు. అన్ని మతాలు గాంధీని ఆరాధించాయి. ఆ కీర్తి ఒక్క మహాత్ముడికే చెల్లుతుంది.

గాంధీని బౌద్ధుడని బౌద్ధబిక్షులు, క్రైస్తవుడని క్రైస్తవోత్తములు, తురష్కులు ముసల్మానని భావించిన గాంధీ ఫకీర్ – మహాత్ముడు. అని గాంధీగారన్న భావాల్ని జాషువా రచనలో కళాత్మకంగా వ్యక్తీకరించింది.

తే॥ గీ॥ ఉప్పు సత్యాగ్రహంబున కుత్సహించి
కఱ్ఱ మోపున జలధికి గదలునాడు
శాంత గంబీర భంగహస్తములు సాచి
యంజలి ఘటించే బాపూజీ కబ్ధిరాజు (బాపూజి. పు. 58)

గాంధీజి "దండి సత్యాగ్రహం" 1930 మార్చి 12న సబర్మతీ ఆశ్రమం నుండి పశ్చిమ తీరానున్న "దండి" అనే గ్రామానికి నడిచివెళ్ళి తానే స్వయంగా, ప్రభుత్వ శాసనాలను ఉల్లంగించి ఉప్పుతయారుచేశాడు. సముద్రుడే బాపూజీకి వందనం చేశాడట. ఆయన వెంట జనం నడుస్తుండగా వెళ్ళిన తీరును చూడడం జాషువా ఎంత కమనీయంగా వర్ణిస్తాడో!

పిల్లల వెంటబెట్టుకొని భిక్షకు బోవు కుటుంబివోలె, మా
చల్లనితాత, విశ్వపరిచారకు డర్ధదిగంబ రేశ్వరుం
డల్లన నబ్ధియాత్రకు బ్రయాణ మొనర్చేడువేళ జిత్తముల్
వెల్లువలై స్రవించినవి ప్రేక్షకులౌ సరకారు వారికిన్ (బాపుజీ. పు. 59)

పిల్లల్ని వెంటబెట్టుకొని భిక్షకుపోయే కుటుంబిలా గాంధీజీ కనిపించాడనటం జాషువ దస్తూరి.

జలనిధిలోని యుప్పోకరి స్వాస్థ్యముగాదు, ప్రభుత్వ శాసనం
బులకు శిరస్సులేదు, ప్రభువుల్ దయమాలినవారు, సూర్య
చంద్రులవలె నబ్ధులున్, బుడమి, రోదసి పేదలసొమ్ము, బారతీ
యుల నిఱు పేదగంజి కయయో! కరవయ్యెనె యుప్పురవ్వయున్
(బాపుజీ.పు. 60)

అని పంచభూతాలు ప్రకృతిదయాభిక్షాలు. సముద్రంలో నుంచి వచ్చే ఉప్పు ప్రజలందరిది అని ఎవరి సొమ్ముకాదు. దానిమీద పన్ను వేయడం అన్యాయం. బడుగుపేదల గంజిలోకి ఉప్పు లేకుండా చేయడం హృదయం లేని వారి పని అనుకుంటాడు గాంధీ. ఉద్యమం చేశాడు. ఉప్పుసత్యాగ్రహం చరిత్రలో చెరగని అన్యాయంగా నిలిచింది. విదేసీయుల పరిపాలనలో ప్రజలు పడుతున్న ఈతి బాధలకు ఓ తార్కాణం మాత్రమే ఈ ఉప్పునిషేధం.

ఆ॥వె॥ మనము బానిసలము, మనకు బానిసల్
శాశ్వతముగ నిమ్నజాతివారు
బాని సింద్రక్రింద బానిసలున్నచో
బలము మమ్మరించు పాలకులకు. (బాపూజీ. పు.76)

అగ్రజాతులు అధమజాతుల్ని నీచంగా చూస్తున్నారు. దూరంగా ఉంచుతున్నారు. మానవత్వాన్ని మంటగలుపుతున్నారు. ఈ అసమానత పాలకులకు వరప్రసాదంలా ఉపకరిస్తూఉంది. మనల్ని ఆంగ్లేయులు బానిసలుగా చూశారు. మనం దళితుల్ని బానిసలుగా పరిగణిస్తున్నాం. మన స్వదేశంలోని బలహీనత విదేశీయులకు బలంగా మారింది. కాబట్టి మనలో మార్పురావాలి. స్వరాజ్యం కోసం పాటు పడాలి అని బాపూజి పిలుపునిస్తున్నాడు. నిమ్న జాత్యోద్ధరణార్థం, హరిజనోద్యమాన్ని ఆహ్వానిస్తున్నాడు.

క॥ సత్యాహింసలు రెండే
ముత్యాల సరాలు సకల పుణ్యంబులకున్
గత్యంతరములు ప్రేమ
వ్యత్యస్థములేని మోక్షపతి నేత్రంబుల్ (బాపుజీ. పు. 82)

అనేపద్యాన్ని గాంధీ హృదయంగా ప్రకటించాడు. ఫలితంగా ఒకవైపు కుల వివక్ష మరోవైపు అస్పృశ్యతా దీక్ష, ఇంకోవైపు హింసాధోరణి అన్ని కలిసి కాపురం చేస్తున్న హిందూ సమాజాన్ని "బాపూజి"లో బాహాటంగా చూపెట్టుతున్నాడు. ఇవన్నీ చాలవన్నట్లు మన తోబుట్టువులైన, మన జీవిత సార్థక సాధనాలైన వనితాలోకాన్ని ఘోషా ముసుగులో మోసం చేయడం సాంఘీక ద్రోహం అంటూ సమకాలిన సమాజాన్ని చూసి, తత్సమాజ నేపథ్యాన్ని చూసి, విసిగి వేసారి పోతున్నాడు కవి.

మహాత్ముని హఠాన్మరణం, అంతిమ ప్రయాణం, మొదలగునవి గుండెల్ని పిండిచేసే దృశ్యాలు కావ్యంలో కళ్ళముందు కదలాడుతాయి. కరుణరసం పొంగిపొరలేరీతిలో పద్యాలు సాగుతుంటే పాఠకుల కళ్ళు తడవక తప్పదు.హృదయబాధ తప్పదు. మాట్లాడటానికి నాలుకలు తడబడతాయట. "వచియింపగ జిహ్వాలాడునే" అంటూ మహాత్ముని బలవన్మరణాన్ని కావ్యం నిండారుగా వర్ణిస్తాడు.

జీవితభాగస్వామిని అయిన అర్ధాంగిని "పరదా"లోపల బంధించడం భావ్యంకాదు. సహధర్మచారిణిని వంటింటి దాసిగా మలచుకోడం మానవత్వంకాదు. ఆమెను విలాస వస్తువుగా వాడుకొని వదిలేయడం పరిపాటి కాదు. వారి స్వేచ్ఛనపహరించడం పరోక్షంగ వారికి ద్రోహం చేయడమే అంటూ దూషిస్తున్నాడు గాంధీజి. స్త్రీ స్వాతంత్ర్యానికి మద్దతునిస్తున్నాడు. మహిళాభ్యుదయానికి సుస్వాగతం పలుకుతున్నాడు. హింసను వ్యతిరేకిస్తూ అహింసకు హారతి పడుతున్నారు. సత్య అహింసలకు మించిన సద్గుణాలు వేరేలేవు. అవే జాతికి మోక్షకారకం.

ఖద్దరునేత నాడు ఇంటింటిలో కుటీర పరిశ్రమగా నెలకొంది. ఖద్దరు నేతగాళ్ళు నోళ్ళోదుమ్ముకొట్టి, విదేశీవస్త్రాల్ని గూర్చి విశేషంగా ప్రోత్సహించింది ప్రభుత్వం. మగ్గాలు మూలనపడి తుప్పుపట్టాయి. బీదవారికి జీవనాధారం కష్టమైంది. ఇలాంటి పరిస్థితిని పసిగట్టాడు గాంధీ. విదేశీవస్త్ర బహిష్కరణను చేశాడు. మొత్తం భారతీయులు గాంధీని అనుసరించింది.

క్విట్ ఇండియా ఉద్యమం తీవ్రరూపాన్ని దాల్చింది. సహాయ నిరాకరణోద్యమం భీకరత్వాన్ని ధరించింది. అన్నింటికి గాంధీ ముందున్నారు. బారతీయులు గాంధీని వెన్నంటి ఉన్నారు. ఇలా ఆ రోజుల్లో బ్రిటిష్ రాజ్యంపై తిరుగుబాటు ఒకప్రక్క, స్వదేశంలో స్వజాతిలో పంచముని నిరసనం, స్త్రీ స్వేచ్ఛారాహిత్యంలాంటి దుష్ట చేష్టలు ఒక ప్రక్క దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. అన్నింటికి "బాపూజి" కావ్యం అద్దంపట్టింది.

గాంధీజీ స్త్రీ జనోద్ధరణ అస్పృశ్యతా నిరసనం వంటి అంశాలకు చక్కని ప్రాతిపదికాలు వేశారు. చక్కని పథకాలను రూపొందించి వాటికి ప్రమాణిక సందేశ సూత్రాలను రూపొందించారు. అందుకే చిరకాలంలోనే అయన ఆశయాలు సత్ఫలితాలను సాధించిపెట్టాయి.

జాషువ మతాన్ని ద్వేషించాడు "చుప్పనాతి" అని నిరసించాడు. మనుషుల మధ్య దూరాన్ని పెంచే విభేదాలను ఖండించాడు. గాంధీయం సమానత్వాన్ని సాధిస్తుందని ప్రభోధించాడు. "స్వాగతించుకే మఖిల జాతులను కాఫీ దుకాణాలు నిండాదరమున" అని అంటరాని తనాన్ని వ్యతిరేఖించాడు.

మహాకవి జాషువ గాంధీజి వ్యక్తిత్వాన్ని అయన ఆశయాలను పునాదులుగా నిలిచిన తాత్వికతను తన బాపూజీ కావ్యంలో అడుగడుగునా వర్ణించాడు. గాంధీజీని దేవుడుగా సంభావించాడు. ప్రపంచ శాంతి సంధాతగా చిత్రించాడు. విశాల విశ్వాన్ని తన గుండెల్లో పొదిమి పట్టుకున్న మానవతావాదిగా సంకీర్తించాడు. జాషువ కూడా అలాంటివారే.

ఇట్టి పరిస్థితులను బిన్న బిన్నాలుగా నాటి సమాజంలో విషమించిన నేపథ్యాన్ని ఉన్నదున్నట్లుగా కనిపింపచేసిన కవితా విశారదుని కడుపు చల్లగుండుగాక!

**ఉపయుక్త గ్రంథాలు:**


1. జాషువ రచనలు (రెండవ సంపుటం) – బాపూజీ ఖండకావ్యం.
2. బాపూజీ – గుఱ్ఱం జాషువా – జాషువా శతజయంతి ప్రచురణ, 1995.
3. సత్యశోధన లేక ఆత్మకథ – మోహనదాస్ కరమ్‌చందా గాంధీ.


***